మెనూ ప్రకారం భోజనం అందించాలి

కల్వరాల్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీసీఈవో చందర్‌నాయక్

రామారెడ్డి/బాన్సువాడ రూరల్, జనవరి 18 : సదాశివనగర్ మండలం కల్వరాల్ గ్రామంలో జడ్పీసీఈవో చందర్‌నాయక్ శనివారం పర్యటించారు. గ్రామంలో చేపట్టిన రేషన్‌కార్డుల సర్వే, రైతు భరోసా, నర్సరీ, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తదితర వాటిని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. సంబంధిత అధికారుల నుంచి సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించేందుకు చేపట్టిన రేషన్ కార్డు సర్వేను ఇంటింటికీ తిరుగుతూ పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో నాగరాజు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బాన్సువాడ మండలంలోని కాద్లాపూర్, తాడ్కోల్ గ్రామాల్లో చేపడుతున్న రేషన్ కార్డు సర్వేను ఎంపీవో సత్యనారాయణరెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. సర్వే వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులతో అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రశాంతి, షెహనాజ్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగిపై కేసు నమోదు

లింగంపేట, జనవరి 18 : మండల కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పేరిట డబ్బుల వసూలుకు పాల్పడిన పల్లె దవాఖాన కాంట్రాక్ట్ ఉద్యోగి సామల బాలకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. లింగపూర్ గ్రామంలోని పల్లె దవాఖానలో మల్టి లెవల్ హెల్త్ ప్రొవైడర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో బాలకృష్ణ విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం లింగంపేటలో ఇద్దరు ప్రైవేట్ వైద్యులను బెదిరించి రూ.25వేలు వసూలు చేశాడు. డబ్బుల వసూలుపై అనుమానం వచ్చి నిలదీయడంతో బాలకృష్ణ అసలు విషయం బయటపడింది. లింగంపేటలో బెదిరించి డబ్బులు వసూలు చేసిన బాలకృష్ణపై ముగ్గురు వైద్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

లింగంపేట, జనవరి 18 : మండలంలోని ఒక గ్రామానికి చెందిన ప్రేమ జంట శనివారం పోలీసులను ఆశ్రయించారు. కొంత కాలంగా ప్రేమించుకుంటున్న వీరివి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించకలేదు. దీంతో వారు యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారు. ఇరు కుటుంబాల వారు గాలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న వీరు లింగంపేట పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై స్థానిక ఎస్సై సుధాకర్‌ను వివరణ కోరగా ప్రేమ వివాహం చేసుకున్న ఇరువురు మేజర్లని తెలిపారు. ఇరువురి కుటుంబాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పంపినట్లు ఎస్సై తెలిపారు.

సర్వే వివరాలు త్వరగా అందించాలి

క్యాసంపల్లిలో వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

గుర్జకుంటలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి రూరల్/భిక్కనూరు/గాంధారి/పెద్ద కొడప్‌గల్/లింగంపేట, జనవరి 18 : సాగుకు యోగ్యంగాలేని వ్యవసాయ భూములను పరిశీలించి వివరాలను త్వరగా అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలోని భూములను కలెక్టర్ శనివారం పరిశీలించారు. సర్వే నంబర్ 330, 331, 332, 333లో ఉన్న 58 ఎకరాల భూములను పరిశీలించారు. ఇందులో 30 ఎకరాల భూమి లే అవుట్ చేసి ఉన్నదని, మిగతా 28 ఎకరాలు పంట సాగులో ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, తహసీల్దార్ జనార్దన్, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. భిక్కనూరు మండలం గుర్జకుంట గ్రామంలో సాగుకు యోగ్యం లేని భూములను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. సాగుకు యోగ్యంలేని భూముల వివరాలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. రైతులు సాగు చేస్తున్న భూములను సర్వే చేసి గుర్తించాలని గాంధారి మండల ప్రత్యేకాధికారిణి లక్ష్మీప్రసన్న అన్నారు. మండల కేంద్రంలో అధికారులు చేపడతున్న రైతు భరోసా సర్వేను తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వేలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నాయబ్ తహసీల్దార్ రవి, మండల వ్యవసాయాధికారి రాజలింగం, సర్వేయర్, ఏఈవో ఉన్నారు. పెద్ద కొడప్‌గల్ మండలంలోని తుప్ధాల్ గ్రామ శివారులో రైతు భరోసా సర్వేను మండల ప్రత్యేకాధికారి కిషన్ పరిశీలించారు. రైతు భరోసా సర్వేను పక్కగా నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆర్ఐ అంజయ్య, ఏఈవో తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట మండలంలోని కన్నాపూర్, కొండాపూర్, కోర్పోల్, శెట్పల్లి, పర్మళ్ల గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించినట్లు వ్యవసాయ శాఖ అధికారి అనిల్ కుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూములను గుర్తిస్తున్నట్లు తెలిపారు. గుర్తించిన భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి వెంట ఆయా గ్రామాల ఏఈవోలు, రెవిన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

కన్నాపూర్, తుప్‌ధాల్ గ్రామ శివారులో సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు కోసం సర్వే నిర్వహిస్తున్న అధికారులు

గాంధారిలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతిని అందజేస్తున్న ఎస్సై ఆంజనేయులు

వ్యసనాలకు దూరంగా ఉండాలి

గాంధారి, జనవరి 18 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని గాంధారి ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్ పాఠశాల మైదానంలో వారం రోజుల నుంచి కొనసాగుతున్న గాంధారి ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) మూడో సీజన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో మండల కేంద్రానికి చెందిన సంతోష్‌గౌడ్ జట్టు విజేతగా నిలువగా, ప్రశాంత్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. వీరికి ట్రోఫీలను ఎస్సై అందజేశారు.

ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ సురేశ్‌చంద్ర, మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్, ట్రైనీ ఎస్సై అరుణ్‌కుమార్, మండల మాజీ కో-ఆప్షన్ సయ్యద్ ముస్తాఫా, వడ్ల ప్రకాశ్, నితిన్‌రావు, ఆకుల రాజేశ్, నిఖిల్‌రావు, సందీప్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

1 నుంచి యోగా శిక్షణ కార్యక్రమాలు

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జనవరి 18 : జిల్లా కేంద్రంలోని ప్రొబెల్స్ పాఠశాలలో వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు భారత స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాందేవ్ శిష్యులు పరమార్థ దేవ్ సారథ్యంలో నిర్వహించనున్న యోగా శిక్షణ కార్యక్రమ క్యాలెండర్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ శిబిరానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భారత స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, యోగా గురువు గరిపల్లి అంజయ్య, పతంజలి యోగా సమితి అధ్యక్షుడు అంజయ్య, సిద్ధాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మహిళా సంఘాల ఏర్పాటు

పెద్దాయిపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న ఏపీఎం సాయిలు

రాజంపేట్, జనవరి 18 : మండలంలో మహిళా సంఘాల్లో చేరకుండా ఉన్న మహిళలను గుర్తించి నూతన మహిళా సంఘాల్లో చేర్పించినట్లు ఏపీఎం సాయిలు తెలిపారు. పెద్దాయిపల్లిలో 10 మంది మహిళలను శ్రీశక్తి సంఘంలో 10 మందిని అన్నపూర్ణ సంఘంలో, శివాయిపల్లి గ్రామంలో 10 మంది సభ్యులను అయ్యప్ప సంఘంలో చేర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం సాయిలు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి మహిళా సంఘాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, రమేశ్, గ్రామ సంఘం అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బీబీపేట్, జనవరి 18 : మండలంలోని ఆకారం రోడ్డు వద్ద ఎస్సై ప్రభాకర్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది శనివారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణపత్రాలులేని 20 మంది వాహనదారులకు జరిమానా విధించారు. పోలీస్ సిబ్బంది శంకర్, అనిల్ కుమార్, ఫయాజ్ పాల్గొన్నారు.

మానసిక వ్యాధులపై అవగాహన

రోగులను పరీక్షిస్తున్న మానసిక వైద్యుడు రమణ

రాజంపేట్, జనవరి 18 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించినట్లు సైకియాట్రిస్ట్ డాక్టర్ రమణ ఎంబీఎస్, ఎండీ శనివారం తెలిపారు. నిద్రలేమి, మద్యపానం, ధూమపానం చేయడం, వాళ్లంతట వాళ్లే మాట్లాడుకోవడం వంటి పది మంది మానసిక వ్యాధిగ్రస్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచిత మందులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాహుల్, సూపర్‌వైజర్ మహ్మద్ మంజూర్, గంగమణి, స్టాఫ్‌నర్సు ఇందిర, సంతోష్, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ శిక్షణ మేళా

బిచ్కుంద, జనవరి 18 : ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 20న ప్రధాన మంత్రి జాతీయ శిక్షణ మేళా(పీఎంఎన్ఏఎం) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.apprenicesshipindia.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ మేళాలో ఐటీసీ ఫుడ్ డివిజన్(హైదరాబాద్), ఎల్ అండ్ టీ, వరుణ్ మోటార్స్, మహేంద్ర మోటార్స్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ పాస్ సర్టిఫికెట్‌తోపాటు పదో తరగతి మెమో, ఆధార్ కార్డు తదితర జిరాక్స్ కాపీలతో బిచ్కుంద ఐటీఐ కళాశాలలో ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

బిచ్కుందలో పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిలోని జీవదాన్ పాఠశాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి రూరల్)/బాన్సువాడ/బీబీపేట, (దోమకొండ)/బిచ్కుంద, జనవరి 18 : ఎల్లారెడ్డిలో నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశం తెలిపారు. జీవదాన్ పాఠశాలలో రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మొదటి సెంటర్‌లో 240 మంది విద్యార్థులకుగాను 166 మంది హాజరుకాగా 74 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. రెండో సెంటర్‌లో 227 మంది విద్యార్థులకుగాను 158 మంది హాజరుకాగా 69 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రం వద్ద స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో 641 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 520 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. బాన్సువాడలోని పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి రాజు సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వరప్రసాద్, మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు ఉన్నారు. దోమకొండ మండల కేంద్రంలో నవోదయ పరీక్ష ప్రశాతంగా ముగిసింది. బాలుర ఉన్నత పాఠశాలలో మొత్తం 195 మంది విద్యార్థులకుగాను 80 మంది హాజరవగా, 115 మంది గైర్హాజరయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో మొత్తం 192 మంది విద్యార్థులకుగాను 130 మంది పరీక్ష రాయగా 62 మంది గైర్హాజరైనట్లు ఎంఈవోలు విజయకుమార్, అశోక్ తెలిపారు. ఎలాంటి ఘటనలు జరగాకుండా ఉండేందుకు ఎస్సై ప్రభాకర్, ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. బిచ్కుందలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మూడు కేంద్రాల్లో 620 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 420 మంది హాజరయ్యారని, 200 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

మాచారెడ్డి, జనవరి 18 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మాచారెడ్డి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవలపై శనివారం అవగాహన కల్పించారు.

ఆర్థిక నిర్ణయాలను సమర్థవంతంగా తీసుకొని ఆర్థిక సంక్షేమాన్ని సాధించడమే లక్ష్యంగా చేసుకోవాలని, పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేయాలని, ప్రైవేట్ పెట్టుబడుల్లో కాకుండా బ్యాంకుల్లో పొదుపు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ ఎన్‌జీవో కౌన్సెలర్ ప్రవీణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగుల నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గాంధారి, జనవరి 18 : దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు నిర్వహిస్తున్న నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గాంధారి ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆవరణలో దివ్యాంగుల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి హాజరయ్యేవారు తమ వెంట దివ్యాంగుల సర్టిఫికెట్‌తోపాటు ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణపత్రం, వైకల్యం కనబడేలా ఫొటోలు తీసుకొని ఎల్లారెడ్డిలోని మార్కెట్ కమిటీలో నిర్వహించే శిబిరానికి రావాలని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

బాన్సువాడ, జనవరి 18 : మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు బాన్సువాడ రూరల్ సీఐ రాజేశ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాగుడుకు బానిసైన రవి డబ్బుల కోసం పిట్లం మండలంలోని చిన్న కొడప్‌గల్‌లో తన మేనత్త సత్తవ్వను హత్య చేసినట్లు తెలిపారు. నిందితుడు రవిని పిట్లంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చామని, అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భిక్కనూరు, జనవరి 18 : గుర్తు తెలియని పరుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ సాజీద్ (60) కిరాణం దుకాణం నడిపించేవాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం గుర్తు తెలియని పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **ERRA MOUNIKA** D/o. **ERRA LINGANNA** (Old Name) R/o. H.No.8-48, Pochammagally, Balkonda Proper and Mandal Dist. Nizamabad, T.S. Changed my name as **TEDDU MADHUMITHA W/o. TEDDU BALA KRISHNA** (New name)

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డిరూరల్)/లింగంపేట, జనవరి18: ఎల్లారెడ్డి మండలంలోని జాన్కంపల్లి కుర్దు గ్రామంలో సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరైన రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. లింగంపేట మండలంలోని పోల్కంపేట గ్రామంలో సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లింగంపేట(తాడ్వాయి), జనవరి 18 : తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులు శనివారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

లింగంపేట, జనవరి 18 : మండలంలోని ముస్తాపూర్ తండాకు చెందిన అంబ్రియాకు రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకులు పంపిణీ చేశారు. తండాకు చెందిన మోహన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాయకులు శనివారం మోహన్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బడిబయటి విద్యార్థుల గుర్తింపు

విద్యాశాఖ అధికారులు గుర్తించిన బడిబయటి విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డిరూరల్)/లింగంపేట, జనవరి 18 : ఎల్లారెడ్డి మండలం కొట్టాల్, కొట్టాల్ తండాలో శనివారం బడిబయటి విద్యార్థుల కోసం సర్వే నిర్వహించినట్లు టీటీయా జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ తెలిపారు. బడిబయట గుర్తించిన విద్యార్థులను పాఠశాలలో చేర్పించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీఆర్‌పీ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ మంజుల తదితరులు ఉన్నారు. లింగంపేట మండలం ఎక్కాపల్లి, సురాయిపల్లి, గాంధీనగర్, బూరుగిద్ద, కొట్టాల్‌గడ్డ తండాల్లో బడిబయటి విద్యార్థుల కోసం సర్వే నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి షౌకత్ అలీ తెలిపారు. ఎంఈవో వెంట సీఆర్‌పీలు గంగాధర్, రాజు, విజయ్, ఐఈఆర్‌పీ అశ్విని తదితరులు ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

అంగన్‌వాడీ కేంద్రంలో ఊడిపడిన పైకప్పు పెచ్చులు..

నాగిరెడ్డిపేట, జనవరి 18: అంగన్‌వాడీ కేంద్రంలో పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. చిన్నారులకు ప్రమాదం తృటిలో తప్పింది. మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఉదయం పెచ్చులూడి చిన్నారుల పక్కన పడ్డాయి. చిన్నారులపై పడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని అంగన్‌వాడీ కార్యకర్త సబిత తెలిపారు. పెచ్చులు పడిన శబ్దానికి చిన్నారులు, తాను భయాందోళనకు గురయ్యామని చెప్పారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ సాయిలు, కార్యదర్శి శంకర్‌నాయక్ చేరుకొని పరిశీలించారు. గతంలో ఇలాగే ఒకసారి సెలవు రోజు పెచ్చులూడి పడ్డాయన్నారు. ఇప్పుడు చిన్నారులు ఉండగానే పైకప్పు పెచ్చులు పడ్డాయని తెలిపారు. పాత భవనం కావడంతో.. ఎప్పుడు పైకప్పు కూలుతుందోనని.. చిన్నారులకు రక్షణ లేకుండా ఉందని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకొనే వారు లేరన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మించాలని వారు కోరారు.

పెచ్చులను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ సాయిలు, పంచాయతీ కార్యదర్శి శంకర్‌నాయక్